20-08-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - కార్య వ్యవహారాలు చేసుకుంటూ కూడా ఒక్క తండ్రి స్మృతి ఉండాలి, నడుస్తూ-తిరుగుతూ తండ్రిని మరియు ఇంటిని స్మృతి చేయాలి, ఇదే మీ సాహసము"

ప్రశ్న:- తండ్రి గౌరవము మరియు అగౌరవము ఎప్పుడు జరుగుతుంది మరియు ఎలా జరుగుతుంది?

జవాబు:- ఎప్పుడైతే పిల్లలైన మీరు తండ్రిని బాగా స్మృతి చేస్తారో అప్పుడు గౌరవాన్ని ఇస్తారు. ఒకవేళ స్మృతి చేయడానికి సమయం లేదు అని అన్నట్లయితే అది కూడా అగౌరవపరిచినట్లే. వాస్తవానికి అది తండ్రిని అగౌరవపరచడం కాదు, అది మిమ్మల్ని మీరు అగౌరవపరచుకోవడమే, అందుకే కేవలం భాషణ ఇవ్వడంలోనే ప్రసిద్ధులుగా అవ్వడం కాదు, స్మృతియాత్రలో ప్రసిద్ధులుగా అవ్వండి, స్మృతి చార్టును పెట్టండి. స్మృతి ద్వారానే ఆత్మ సతోప్రధానంగా అవుతుంది.

ఓం శాంతి. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి అర్థం చేయిస్తారు, ఈ 84 జన్మల చక్రం యొక్క జ్ఞానమేదైతే అర్థం చేయించబడుతుందో ఇది జ్ఞానము. దీనిని పిల్లలైన మనము జన్మ-జన్మాంతరాలూ చదివాము మరియు ధారణ చేస్తూ వచ్చాము. ఇది పూర్తిగా సహజమైనది, ఇది కొత్త విషయమేమీ కాదు.

తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు - సత్యయుగం నుండి మొదలుకుని కలియుగాంతం వరకు మీరు ఎన్ని పునర్జన్మలు తీసుకున్నారు. ఈ జ్ఞానమైతే సహజ రీతిలో బుద్ధిలో ఉండనే ఉంది. ఇది కూడా ఒక చదువు, రచన యొక్క ఆదిమధ్యాంతాలను అర్థం చేసుకోవాలి. వీటిని తండ్రి తప్ప ఇంకెవ్వరూ అర్థం చేయించలేరు. తండ్రి అంటారు, ఈ జ్ఞానం కన్నా ఉన్నతమైనది స్మృతియాత్ర, దీనిని యోగము అని అంటారు. యోగము అన్న పదము ప్రసిద్ధమైనది. కానీ ఇది స్మృతియాత్ర. మనుష్యులు యాత్రకు వెళ్ళినప్పుడు మేము ఫలానా తీర్థయాత్రకు వెళ్తున్నాము అని అంటారు. శ్రీనాథద్వార్ కు లేక అమరనాథ్ కు వెళ్ళినప్పుడు అది గుర్తుంటుంది. ఇప్పుడు మీకు తెలుసు, ఆత్మిక తండ్రి అయితే చాలా సుదీర్ఘమైన యాత్రను నేర్పిస్తారు, అదేమిటంటే - నన్ను స్మృతి చేయండి. ఆ యాత్రలకు వెళ్ళినప్పుడైతే మళ్ళీ తిరిగి వస్తారు. ఇది ఎటువంటి యాత్ర అంటే దీని ద్వారా ముక్తిధామంలోకి వెళ్ళి అక్కడ నివసించాలి. మళ్ళీ పాత్రలోకి వస్తారు కానీ ఈ పాత ప్రపంచంలోకి రారు. ఈ పాత ప్రపంచం పట్ల మీకు వైరాగ్యము ఉంది. ఇది ఛీ-ఛీ రావణ రాజ్యము. కావున ముఖ్యమైన విషయం స్మృతియాత్ర. చాలామంది పిల్లలకు ఏ విధంగా స్మృతి చేయాలో కూడా తెలియదు. ఎవరైనా స్మృతి చేస్తున్నారా, లేదా అన్నది చూడటానికి అది కనిపించే విషయం కాదు. తండ్రి అంటారు, స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రినైన నన్ను స్మృతి చేయండి. ఇది కనిపించే విషమేమీ కాదు, అలాగే ఇది తెలుసుకోలేము కూడా. ఆ అవస్థలో ఎంతవరకు స్మృతియాత్రలో నిలిచి ఉంటున్నారు అన్నది స్వయానికే తెలుస్తుంది. యుక్తినైతే అనేకులకు తెలియజేస్తారు. కళ్యాణకారి అయిన తండ్రి అర్థం చేయించారు - స్వయాన్ని ఆత్మగా భావిస్తూ శివబాబాను స్మృతి చేయండి. మీ సేవను కూడా చేస్తూ ఉండండి. ఉదాహరణకు పిల్లలు కాపలా కాస్తూ ఉంటారు, అంతా తిరుగుతూ ఉంటారు, వారికి స్మృతిలో ఉండడమైతే చాలా సహజము. ఒక్క తండ్రి స్మృతి తప్ప ఇంకేమీ గుర్తుకు రాకూడదు. బాబా ఉదాహరణను ఇచ్చి తెలియజేస్తారు. ఆ స్మృతియాత్రలోనే రావాలి, వెళ్ళాలి. క్రిస్టియన్ ఫాదర్లు వెళ్తూ ఉంటారు, వారు ఎంత సైలెన్స్ లో వెళ్తారు. కావున పిల్లలైన మీరు కూడా చాలా ప్రేమగా తండ్రిని మరియు ఇంటిని స్మృతి చేయాలి. ఈ గమ్యం చాలా భారీ అయినది. భక్తులు కూడా ఇదే పురుషార్థం చేస్తూ ఉంటారు. కానీ వారికి, మేము తిరిగి వెళ్ళాలి అన్న విషయం తెలియదు. వాళ్ళు ఏమనుకుంటారంటే, ఎప్పుడైతే కలియుగం పూర్తవుతుందో అప్పుడు వెళ్తాము అని. వారికి కూడా ఇలా నేర్పించేవారు ఎవ్వరూ లేరు. పిల్లలైన మీకైతే నేర్పించబడుతుంది. కాపలా కాసేటప్పుడు ఏకాంతంలో ఎంతగా తండ్రిని స్మృతి చేస్తారో అంత మంచిది. స్మృతి ద్వారా పాపాలు అంతమవుతాయి. జన్మజన్మాంతరాల పాపాలు తలపై ఉన్నాయి. ఎవరైతే మొదట సతోప్రధానంగా అవుతారో, రామరాజ్యంలోకి కూడా మొదట వారు వెళ్తారు. కావున వారే అందరికన్నా ఎక్కువగా స్మృతియాత్రలో ఉండాలి. ఇది కల్ప-కల్పపు విషయము. కావున వీరికి స్మృతియాత్రలో ఉండే మంచి అవకాశము ఉంది. ఇక్కడైతే ఎటువంటి గొడవలు-కొట్లాటల విషయం లేదు. అటు-ఇటు తిరుగుతూ, కూర్చుంటూ ఒకేసారి రెండు కార్యాలూ చేయవచ్చు - కాపలా కూడా కాయవచ్చు, తండ్రిని కూడా స్మృతి చేయవచ్చు. కర్మలు చేస్తూ తండ్రిని స్మృతి చేస్తూ ఉండండి. కాపలా కాసేవారికైతే అందరికన్నా ఎక్కువ లాభముంది. పగలైనా లేక రాత్రయినా, ఎవరైతే కాపలా కాస్తారో, వారికి ఎంతో లాభముంటుంది. కానీ ఒకవేళ ఇలా స్మృతి చేసే అలవాటు ఏర్పడితే అప్పుడు లాభముంటుంది. తండ్రి ఈ సేవను చాలా బాగా ఇచ్చారు, కాపలా మరియు స్మృతియాత్ర. ఈ విధంగా కూడా

తండ్రి స్మృతిలో ఉండే అవకాశం లభిస్తుంది. స్మృతియాత్రలో ఉండేందుకు ఈ భిన్న-భిన్న యుక్తులను తెలియజేయడం జరుగుతుంది. ఇక్కడ మీరు ఎంతగా స్మృతిలో ఉండగలరో అంతగా బయట వ్యాపారాల వ్యవహారాల్లో ఉండలేరు. అందుకే రిఫ్రెష్ అయ్యేందుకు మధుబన్ కు వస్తారు. ఏకాంతంలోకి వెళ్ళి ఒక పర్వతంపై కూర్చొని స్మృతియాత్రలో ఉండాలి, ఒక్కరైనా వెళ్ళండి లేక ఇద్దరు-ముగ్గురైనా వెళ్ళండి. ఇక్కడ అవకాశం చాలా బాగుంది. తండ్రి స్మృతే ముఖ్యమైనది. భారత్ యొక్క ప్రాచీన యోగం ఎంతో ప్రసిద్ధమైనది కూడా. ఇప్పుడు మీరు అర్థం చేసుకున్నారు, ఈ స్మృతియాత్ర ద్వారా పాపాలు అంతమవుతాయి, మనం సతోప్రధానంగా అవుతాము. కావున ఇందులో పురుషార్థం చాలా బాగా చేయాలి. కర్మలు చేస్తూ కూడా తండ్రి స్మృతిలో ఉండి చూపిస్తే అదే సాహసము. కర్మలనైతే చేయవలసిందే ఎందుకంటే మీరు ప్రవృత్తి మార్గానికి చెందినవారు. గృహస్థ వ్యవహారంలో ఉంటూ, వ్యాపార-వ్యవహారాలు చేసుకుంటూ బుద్ధిలో తండ్రి స్మృతి ఉండాలి, ఇందులో మీకు చాలా-చాలా సంపాదన ఉంది. ప్రస్తుతం చాలామంది పిల్లల బుద్ధిలోకి ఇది రాదు. చార్ట్ పెట్టండి అని తండ్రి చెప్తూ ఉంటారు. కొందరు ఏదో కొద్దిగా వ్రాస్తారు. తండ్రి యుక్తులనైతే ఎన్నో తెలియజేస్తారు. బాబా వద్దకు వెళ్ళాలి అని పిల్లలు కోరుకుంటారు. ఇక్కడ చాలా సంపాదన చేసుకోవచ్చు. ఏకాంతం చాలా బాగుంటుంది. తండ్రి సమ్ముఖంగా కూర్చొని అర్థం చేయిస్తారు, నన్ను స్మృతి చేసినట్లయితే పాపాలు అంతమవుతాయి ఎందుకంటే జన్మజన్మాంతరాల పాపాలు తలపై ఉన్నాయి. వికారాల కోసం ఎన్ని గొడవలు జరుగుతాయి, విఘ్నాలు కలుగుతాయి. బాబా, మమ్మల్ని పవిత్రంగా ఉండనివ్వడం లేదు అని అంటారు. తండ్రి అంటారు - పిల్లలూ, మీరు స్మృతియాత్రలో ఉంటూ జన్మజన్మాంతరాల పాపాలేవైతే తలపై ఉన్నాయో ఆ భారాన్ని దించుకోండి. ఇంట్లో కూర్చొని ఉంటూనే శివబాబాను స్మృతి చేస్తూ ఉండండి. స్మృతినైతే ఎక్కడ కూర్చునైనా చేయవచ్చు. ఎక్కడ ఉన్నా సరే ఈ అభ్యాసము చేయాలి. ఎవరు వచ్చినా వారికి కూడా సందేశాన్ని ఇవ్వండి. తండ్రి అంటారు, స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని స్మృతి చేయండి, దీనినే యోగబలము అని అంటారు. బలము అనగా శక్తి. తండ్రిని సర్వశక్తివంతుడు అని అంటారు. మరి ఆ శక్తి తండ్రి నుండి ఎలా లభిస్తుంది? తండ్రి స్వయం చెప్తారు, నన్ను స్మృతి చేయండి. మీరు కిందకు దిగుతూ, దిగుతూ తమోప్రధానంగా అయిపోయారు కావున ఆ శక్తి పూర్తిగా అంతమైపోయింది. పైసకు విలువ చేసే శక్తి కూడా లేదు. మీలో కూడా బాగా అర్థం చేయించేవారు కొందరు ఉన్నారు, వారు తండ్రిని స్మృతి చేస్తారు.

స్వయాన్ని ప్రశ్నించుకోవాలి, నా చార్ట్ ఎలా ఉంటోంది? తండ్రి అయితే పిల్లలందరికీ చెప్తారు - స్మృతియాత్ర ముఖ్యమైనది. స్మృతి ద్వారానే మీ పాపాలు అంతమవుతాయి. ఎవరైనా మిమ్మల్ని అప్రమత్తం చేసేవారు లేకపోయినా కానీ మీరు తండ్రిని స్మృతి చేయవచ్చు కదా. విదేశాలలో ఒంటరిగా ఉన్నా సరే స్మృతిలో ఉండవచ్చు. ఒకవేళ ఎవరైనా వివాహం చేసుకుంటే పత్ని ఇంకొకచోట ఉంటే ఆమెకు కూడా ఉత్తరం వ్రాయవచ్చు - నీవు కేవలం ఒక్క విషయాన్ని గుర్తుంచుకో, తండ్రిని స్మృతి చేసినట్లయితే జన్మజన్మాంతరాల పాపాలు భస్మమైపోతాయి అని. వినాశనం ఎదురుగా నిలబడి ఉంది. తండ్రి యుక్తులనైతే చాలా బాగా అర్థం చేయిస్తూ ఉంటారు, ఆపై వాటిని పాటిస్తారా, పాటించరా అన్నది వారి ఇష్టం. తండ్రి సలహా అయితే చాలా బాగా ఇస్తారు అని పిల్లలు కూడా భావిస్తూ ఉంటారు. మన పని ఏమిటంటే, మిత్ర-సంబంధీకులు మొదలైనవారెవరైతే కలుస్తారో వారందరికీ సందేశాన్ని ఇవ్వాలి. వారు స్నేహితులైనా లేక ఇంకెవరైనా సరే, సేవ యొక్క అభిరుచి ఉండాలి. మీ వద్ద చిత్రాలైతే ఉన్నాయి, బ్యాడ్జి కూడా ఉంది, ఇది చాలా మంచి వస్తువు. ఈ బ్యాడ్జి ఎవరినైనా లక్ష్మీ-నారాయణులుగా తయారుచేయగలదు. త్రిమూర్తి చిత్రంపై బాగా అర్థం చేయించాలి, ఈ చిత్రంలో పైన శివుడు ఉన్నారు. వారైతే త్రిమూర్తులను తయారుచేస్తారు, కానీ పైన శివుడిని చూపించరు. శివుని గురించి తెలియని కారణంగా భారత్ యొక్క నావ మునిగిపోయి ఉంది. ఇప్పుడు శివబాబా ద్వారానే భారత్ యొక్క నావ ఆవలి తీరానికి చేరుకుంటుంది. పతిత-పావనా, మీరు వచ్చి పతితులైన మమ్మల్ని పావనంగా తయారుచేయండి అని పిలుస్తారు, అయినా మళ్ళీ సర్వవ్యాపి అని అనేస్తారు. ఇది ఎంత తెలివితక్కువ పొరపాటు. తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు, మీరు ఇలా-ఇలా భాషణ చేయాలి. తండ్రి కూడా డైరెక్షన్ ఇస్తూ ఉంటారు, ఇలా మ్యూజియం తెరవండి, సేవ చేయండి, అప్పుడు ఎంతోమంది వస్తారు. సర్కస్ లు కూడా పెద్ద-పెద్ద నగరాలలో పెడుతూ ఉంటారు కదా. వారి వద్ద ఎంత సామాను ఉంటుంది. దాన్ని చూడటానికి గ్రామ-గ్రామాల నుండి అందరూ వస్తారు. అందుకే బాబా అంటారు, మీరు కూడా ఇటువంటి సుందరమైన మ్యూజియంను తయారుచేయండి, దానిని చూసి అందరూ సంతోషించాలి, మళ్ళీ వెళ్ళి ఇతరులకు వినిపించాలి. ఇది కూడా అర్థం చేయిస్తారు, ఏ సేవ అయితే జరుగుతుందో అది కల్పక్రితము వలె జరుగుతుంది, కానీ సతోప్రధానంగా అవ్వాలి అన్న చింతను ఎంతగానో ఉంచుకోవాలి. ఇందులోనే పిల్లలు నిర్లక్ష్యం చేసి పొరపాట్లు చేస్తారు. మాయ విఘ్నాలను కూడా ఈ స్మృతియాత్ర విషయంలోనే కలిగిస్తుంది. మీ హృదయాన్ని మీరు ప్రశ్నించుకోవాలి - మాకు అంత అభిరుచి ఉందా, మేము అంతగా కష్టపడుతున్నామా? జ్ఞానమైతే సామాన్యమైన

విషయమే. తండ్రి తప్ప 84 జన్మల చక్రాన్ని ఇంకెవరూ అర్థం చేయించలేరు. స్మృతియాత్రయే ముఖ్యమైనది. చివరి సమయంలో ఒక్క తండ్రి తప్ప ఇంకెవ్వరూ గుర్తుకు రాకూడదు. డైరెక్షన్లు అయితే తండ్రి పూర్తిగా ఇస్తూ ఉంటారు. ముఖ్యమైన విషయము స్మృతి చేయడము. మీరు ఎవరికైనా అర్థం చేయించవచ్చు. వారు ఎవరైనా కానీ మీరు కేవలం బ్యాడ్జిపై అర్థం చేయించండి. ఇంకెవరి వద్దా ఇలా అర్థ సహితమైన మెడల్స్ ఉండవు. మిలట్రీవారు మంచి పనులు చేస్తే వారికి మెడల్స్ లభిస్తాయి. రాయ్ సాహెబ్ మెడల్ లభిస్తే వీరికి వైస్రాయ్ నుండి టైటిల్ లభించింది అని అందరూ గమనిస్తారు. ఇంతకుముందు వైస్రాయ్ లు ఉండేవారు. ఇప్పుడైతే వారి వద్ద ఎటువంటి శక్తి లేదు. ఇప్పుడు ఎన్ని గొడవలు జరుగుతూ ఉన్నాయి. మనుష్యుల సంఖ్య చాలా పెరిగిపోయింది, కావున వారికి నగరంలో భూమి కావాలి. ఇప్పుడు బాబా స్వర్గాన్ని స్థాపన చేస్తున్నారు, ఇంతమంది అంతమై కొద్దిమందే మిగులుతారు. భూమి ఎంతో ఉంటుంది. అక్కడైతే అన్నీ కొత్తగా ఉంటాయి. ఆ కొత్త ప్రపంచంలోకి వెళ్ళేందుకు బాగా పురుషార్థం చేయాలి. మనుష్యులు ప్రతి ఒక్కరూ చాలా ఉన్నత పదవిని పొందేందుకు పురుషార్థం చేస్తారు. ఎవరైనా పూర్తిగా పురుషార్థం చేయకపోతే, వారు ఫెయిల్ అయిపోతారు అని భావిస్తారు. మేము ఫెయిల్ అయిపోతాము అని స్వయం కూడా అర్థం చేసుకుంటారు, అప్పుడిక చదువు మొదలైనవాటిని వదిలి ఉద్యోగములోకి వెళ్ళిపోతారు. ఈ రోజుల్లోనైతే ఉద్యోగాలలో కూడా చాలా కఠినమైన నియమాలు వెలువడుతూ ఉంటాయి. మనుష్యులు చాలా దుఃఖితులుగా ఉన్నారు. ఇప్పుడు బాబా మీకు ఎటువంటి మార్గాన్ని తెలియజేస్తారంటే ఇక 21 జన్మలు ఎప్పుడూ దుఃఖము అన్న మాటే ఉండదు. తండ్రి అంటారు, కేవలం స్మృతియాత్రలో ఉండండి. ఎంత వీలైతే అంత రాత్రివేళలో స్మృతి చేయడం చాలా మంచిది. పోనీ చారబడి అయినా స్మృతి చేయండి. అలా చేస్తూ కొందరికి నిద్ర వచ్చేస్తుంది. ఎవరైనా వృద్ధులు ఉంటే, ఎక్కువ కూర్చోలేకపోతే తప్పకుండా నిద్రపోతారు. అలా చారబడి తండ్రిని స్మృతి చేస్తూ ఉంటారు. చాలా సంతోషము లోలోపల కలుగుతూ ఉంటుంది ఎందుకంటే ఇందులో చాలా-చాలా సంపాదన ఉంది. ఇంకా సమయం ఉంది అని భావిస్తారు కానీ మృత్యువు ఎప్పుడు వస్తుందో, దానిపై ఎటువంటి నమ్మకము లేదు. కావున తండ్రి అర్థం చేయిస్తారు, ముఖ్యమైనది స్మృతియాత్ర. బయట నగరాలలో ఎంతో కష్టము. ఇక్కడకు వచ్చినప్పుడు చాలా మంచి అవకాశము లభిస్తుంది. ఎటువంటి చింత విషయమూ లేదు. అందుకే ఇక్కడ చార్టును పెంచుతూ ఉండండి. మీ క్యారెక్టర్లు కూడా దీని ద్వారా బాగుపడుతూ ఉంటాయి. కానీ మాయ చాలా శక్తివంతమైనది. ఇంట్లో ఉండేవారికి బయట ఉన్నవారు ఎంతైతే విలువను ఉంచుతారో అంత ఉండదు. అయినా కానీ ఈ సమయంలో గోపుల రిజల్టు బాగుంది.

కొంతమంది కుమార్తెలు - వివాహం కోసం మమ్మల్ని ఎంతగానో విసిగిస్తున్నారు, ఏమి చేయాలి అని వ్రాస్తారు. దృఢమైన వివేకవంతులైన కుమార్తెలు ఎవరైతే ఉంటారో వారు ఎప్పుడూ ఇలా వ్రాయరు. ఇలా వ్రాస్తున్నారంటే వారు గొర్రె లాంటివారు అని బాబా అర్థం చేసుకుంటారు. జీవితాన్ని రక్షించుకోవడమనేది తమ చేతుల్లో ఉన్న విషయము. ఈ ప్రపంచంలో అనేక రకాల దుఃఖాలు ఉన్నాయి. ఇప్పుడు బాబా అయితే సహజంగా తెలియజేస్తారు.

పిల్లలైన మీరైతే మహాన్ భాగ్యశాలురు, మీరు వచ్చి ఈశ్వరుని సంతానముగా అయ్యారు. తండ్రి ఎంత ఉన్నతంగా తయారుచేస్తారు. అయినా మీరు తండ్రిని నిందిస్తూ ఉంటారు, అది కూడా చాలా తప్పుగా నిందిస్తూ ఉంటారు. చెప్పడానికి వీల్లేనంతగా తమోప్రధానంగా అయిపోయారు. ఇంతకన్నా ఎక్కువ ఇంకేం సహిస్తారు. ఎక్కువ విసిగిస్తే అంతం చేసేస్తాము అని అంటారు కదా. ఈ విషయాలను తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు. శాస్త్రాలలోనైతే కథలను వ్రాసేసారు. బాబా యుక్తులనైతే చాలా సహజంగా తెలియజేస్తారు. కర్మలు చేస్తూ స్మృతి చేయండి, ఇందులో చాలా-చాలా లాభం ఉంది. ఉదయమే వచ్చి స్మృతిలో కూర్చోండి. ఎంతో ఆనందం కలుగుతుంది. కానీ అంతటి అభిరుచి లేదు. టీచర్ విద్యార్థుల నడవడికను చూసి వీరు ఫెయిల్ అయిపోతారు అని అర్థం చేసుకుంటారు. అలాగే తండ్రి కూడా అర్థం చేసుకుంటారు - వీరు ఫెయిల్ అయిపోతారు, అది కూడా కల్ప-కల్పాంతరాల కొరకు. భాషణ చేయడంలో ఎంతో చురుకుగా ఉంటారు, ప్రదర్శినీని కూడా అర్థం చేయిస్తారు కానీ స్మృతి లేదు, ఇందులో ఫెయిల్ అయిపోతారు. ఇది కూడా అగౌరవపరడం వంటిదే. ఇలా తమను తామే అగౌరవపరుచుకుంటారు. శివబాబాకైతే అగౌరవము జరుగదు. మాకు స్మృతి చేయడానికి ఖాళీయే లేదు అని ఇలా ఎవ్వరూ అనలేరు. బాబా ఒప్పుకోరు. స్నానం చేసేటప్పుడు కూడా స్మృతి చేయవచ్చు. భోజనం చేసే సమయంలో తండ్రిని స్మృతి చేయండి, ఇందులో చాలా-చాలా సంపాదన ఉంది. కొంతమంది పిల్లలు కేవలం భాషణ చేయడంలో ప్రసిద్ధులుగా ఉన్నారు, యోగము లేదు. ఆ అహంకారము కూడా కింద పడేస్తుంది. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక

పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. సర్వశక్తివంతుడైన తండ్రి నుండి శక్తిని తీసుకునేందుకు స్మృతి చార్టును పెంచాలి. స్మృతి కోసం భిన్న-భిన్న యుక్తులను రచించాలి. ఏకాంతంలో కూర్చొని విశేష సంపాదనను జమ చేసుకోవాలి.

2. సతోప్రధానంగా అవ్వాలి అన్న చింతను పెట్టుకోవాలి. నిర్లక్ష్యముతో పొరపాట్లు చేయకూడదు. అహంకారంలోకి రాకూడదు. సేవ అభిరుచిని కూడా పెట్టుకోవాలి, అలాగే స్మృతియాత్రలో కూడా ఉండాలి.

వరదానము:- అన్నింటినీ తండ్రికి అర్పించి కమలపుష్ప సమానంగా అతీతముగా, ప్రియముగా ఉండే డబుల్ లైట్ భవ

తండ్రికి చెందినవారిగా అవ్వటము అనగా భారమునంతటినీ తండ్రికి ఇచ్చేసెయ్యటము. డబుల్ లైట్ అర్థమే అన్నింటినీ తండ్రికి అర్పించటము. ఈ తనువు కూడా నాది కాదు. మరి తనువే నాది కానప్పుడు ఇక వేరే ఏముంది. మీరందరూ చేసిన ప్రతిజ్ఞ ఏమిటంటే - తనువు కూడా మీదే, మనస్సు కూడా మీదే, ధనము కూడా మీదే. అన్నీ మీవే అని అన్నప్పుడు ఇక భారము ఏ విషయములో. అందుకే కమలపుష్ప ఉదాహరణను స్మృతిలో ఉంచుకొని సదా అతీతముగా మరియు ప్రియముగా ఉన్నట్లయితే డబుల్ లైట్ గా అయిపోతారు.

స్లోగన్:- ఆత్మికత ద్వారా అధికార దర్పాన్ని సమాప్తం చేసి, స్వయాన్ని శరీర స్మృతి నుండి కరిగించి వేసేవారే సత్యమైన పాండవులు.